ప్రజాశక్తి
శుక్రవారం 31 జనవరి 2025
5
విజయనగరం



కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈనెల 24న న జెఎన్‌టియు గురజాడ విజయనగరం యూనివర్సిటీకి చెందిన పురుషుల కిక్ బాక్సింగ్ జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీతం కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 70 నుంచి 80మంది క్రీడాకారులు కిక్, పాయింట్ గేమ్‌లో వివిధ వెయిట్ కేటగిరిలో పాల్గొన్నారు. ఏడుగురు క్రీడాకారులు వివిధ కళాశాలల నుంచి అఖిలభారత అంతర్ విశ్వ విద్యాలయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు పంజాబ్ లోని గురుకాశి యూనివర్సిటీలో ఫిబ్రవరి 11 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయి, జాతీయస్థాయి క్రీడాపోటీలు ఏటా నిర్వహించే ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జెఎన్‌టియుకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ధాన్యం కొనుగోలుకు నిరాకరణ

- ట్రక్ షీట్ల జారీలో జాప్యం
- ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఛార్జీలూ ఎగనామం
- ధాన్యం రైతుల ఆవేదన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ గజపతినగరం

పండగ సమయం నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దాదాపు నెల రోజుల క్రితం నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని గగ్గోలు పెడితే, శ్రీరంగరాజపురానికి చెందిన ఓ మిల్లుకు తీసుకురమ్మన్నారు. ఇప్పటికీ వాటికి సంబంధించి ట్రక్ షీట్ జనరేట్ చేయలేదు. 100 బస్తాలకు గాను దాదాపు రూ.లక్ష రావాల్సివుంది. అటు అప్పులు తీర్చలేక, ఇటు ఇంటి అవసరాలకు డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాను.

– ఇదీ గజపతినగరం మండలం కెంగువ గ్రామానికి చెందిన రైతు రెడ్డి అప్పలనాయుడు ఆవేదన.

నేను 180 బస్తాల ధాన్యం పండక్కి ముందే ప్రభుత్వానికి విక్రయించాను. గోనె సంచులు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు నేనే భరించాను. హమాలీలను కూడా తానే పెట్టుకున్నాను. గోనె సంచులకు చెల్లిస్తామన్న డబ్బులకు టికానా లేదు. ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఛార్జీలు కూడా చిల్లుగవ్వ ఇవ్వలేదు. మరీ ఇంత ఘోరమా?

– గజపతినగరం మండలం లోగిశ గ్రామానికి చెందిన తాడ్డి గౌరునాయుడి వ్యథ ఇది.

ఇది కేవలం అప్పలనారాయణ, గౌరు నాయుడి సమస్య మాత్రమే కాదు. గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాలతోపాటు విజయనగరం జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇప్పటికీ ధాన్యం కొనుగోలుకు నోచుకోలేదు. దీంతో, కొందరి ధాన్యం కల్లాల్లోనూ, మరికొందిరి ధాన్యం మిల్లుల్లోనూ ఉన్నాయి. ఇప్పటికే కొనుగోలుచేసిన ధాన్యానికి సంబంధించి ట్రాన్స్‌పోర్టు, హమాలీ ఛార్జీలు తమకు చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు గోనె సంచులకూ డబ్బులు ఇవ్వలేదంటున్నారు. ఇప్పటికే మిల్లుల్లోవున్న ధాన్యానికి కూడా ట్రక్ షీట్లు జారీ చేసేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 2,43,400 ఎకరాల్లో వరి సాగైంది. తద్వారా 4,97,614 మెట్రిక్ టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసిది. ఇందులో సుమారు 47వేల మెట్రిక్ టన్నుల మేర తిండికిపోగా రైతులు 4.50లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం విక్రయించేందుకు అవకాశం ముందని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో నడిచే సివిల్ సప్లై విభాగం 3.20లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు మాత్రమే లక్ష్యంగా తీసుకుంది. ఇందులో ఇప్పటి వరకు 3,13 మెట్రిక్ టన్నుల (98శాతం) ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు చెప్తున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గజపతినగరం మండలంలో లక్ష్యానికి మించి (109శాతం) ధాన్యం కొనుగోలు చేసినట్టుగా సివిల్ సప్లయి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆచరణలో ఈ మండల పరిధిలోని కెంగువ, లోగిస, జిన్నాం, మధుపాడ, పాతబగ్గాం, కొత్తబగ్గాం, గంగచోళ్లపెంట, పురిటిపెంట తదితర గ్రామాల్లో 2వేల నుంచి 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నాయి.

తమ ధాన్యం ఇప్పటికీ కొనుగోలు చేయలేదంటూ కెంగువ గ్రామానికి చెందిన పెనుమజ్జి రాము, గుడివాడ అప్పలనాయుడు, గొర్లె బుల్లయ్య, మజ్జి నారాయణ, గుడివాడ చిన్నం నాయుడు తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 5బస్తాలు విక్రయించినప్పటికీ, ట్రాన్స్‌పోర్టు, హమీలీ ఛార్జీలు చెల్లించలేదని తాడ్డి సన్యాసమ్మ కన్నీరుపెడుతోంది. కొద్ది రోజుల క్రితం తమ ధాన్యాన్ని సాలిపేట, పాత బగ్గాంలోని మిల్లలకు తీసుకురమ్మన్నారని, తీరా తీసుకెళ్లాక ట్రక్ షీట్లు ఇవ్వడం లేదని పాత బగ్గాం గ్రామానికి చెందిన కుమిలి పైడుపునాయుడు, పప్పల గురునాయుడు, కోట రామునాయుడు, మిత్తిరెడ్డి బలరాం, లెంక గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం 4,736 మెట్రిక్ టన్నులకు మాత్రమే ఇంకా ట్రక్ షీట్లు జారీ చేయాల్సివున్నట్టు లెక్కలు చూపుతున్నారు. ఆచరణలో దీని పది రెట్లు ధాన్యం జిల్లా వ్యాప్తంగావున్న మిల్లుల్లోనే ఉన్నట్టుగా తెలుస్తోంది. మరోవైపు కొత్తవలస, వేపాడ, ఎస్.కోట, భోగాపురం, ఎస్.కోట తదితర మండలాల్లో అధికారులు చూపుతున్న సగటు కొనుగోలు శాతంలో సగం మాత్రమే కనిపిస్తోంది.

కెంగువలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు

రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలి

జాయింట్ కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం లేఖ

విజయనగరం టౌన్ : జిల్లాలో ధాన్యం కొనుగోలు రైతు సేవ కేంద్రాలు ద్వారా కొనుగోలు చేసే విధంగా జాయింట్ కలెక్టర్ చర్యలు తీసుకోవాలని గురువారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు లేఖ రాశారు. జిల్లా లో ధాన్యం కొనుగోలులో కొన్ని రైతు సేవ కేంద్రాల్లో టార్గెట్ అయిపోయిందని రైతులు ధాన్యం ట్రక్ షీట్ చెయ్యడం లేదన్నారు. గంట్యాడ మండలం బోనంగి, వసాది, ఎస్.కోట మండలం కొట్టాం తదితర కేంద్రాల్లో, ఈ విధంగా జిల్లాలో అనేక కేంద్రాలలో రైతులు ధాన్యం కొనుగోలు కోసం ఆందోళన చెందుతున్నారన్నారు.జాయింట్ కలెక్టర్ స్పందించి జిల్లాలో రైతులు ధాన్యం నిలుపుదల చేసిన రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

అమల్లోకి మోడల్ కోడ్

- జిల్లాలో 4937 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ బిఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం ఎంఎల్‌సి ఎన్నిక కోసం ఈనెల 29న షెడ్యూల్ వెలువడినందున ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోనికి వచ్చిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ఎన్నిక కోసం విశాఖపట్నం జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, విశాఖపట్నం శ్రీకాకుళం, విజయనగరం మన్యం, అనకాపల్లి, ఎఎస్‌ఆర్ జిల్లాల డిఆర్‌ఒలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉంటారని తెలిపారు. ఫిబ్రవరి 3 న విశాఖపట్నం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, నామినేషన్ల స్వీకరణకు ఫిబ్రవరి 10 వ తేదీ ఆఖరు తేదీయని, 11న పరిశీలన, 13న ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 27 న ఎన్నిక ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు జరుగుతుందని ఓట్ల లెక్కింపు మార్చి 3న ఉంటుందని, మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేసారు.

ఎన్నికల నిర్వహణపై గురువారం తహశీల్దార్లు , స్టేషన్ హౌస్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేసారు. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని, పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెకీలు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు బృందాలు , ఎఫ్.ఎస్.టి బృందాలు పని చేస్తాయని తెలిపారు. రూట్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించి, వారికి శిక్షణ ఇస్తామని తెలిపారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్‌డిఒలు గుర్తించాలని తెలిపారు. తహసిల్దార్ , స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంటనే తమ పరిదిలోనున్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అన్నిరకాల వసతులు ఉన్నవి లేనిది తనిఖీ చేసుకోవాలని తెలిపారు. వాహనాల కోసం, బాలెట్ బాక్స్ ల కోసం ఇండెంట్ పెట్టాలని తెలిపారు. బాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది కావునా బాలెట్ బాక్స్‌లను తనిఖీ చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. జిల్లాలో 29 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతి మండలంలో ఒక పోలింగ్ కేంద్రం ఉందని, విజయనగరం లో 3 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 4937 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, వారిలో 3100 మంది పురుషులు కాగా 1837 మంది మహిళా ఓటర్లు ఉన్నారని తెలిపారు.

అదనపు ఎస్.పి సౌమ్య లత మాట్లాడుతూ మోడల్ కోడ్ పక్కాగా అమలు జరపాలని, , సెక్యూరిటీ విషయం లో అన్ని పోలింగ్ కేంద్రాలను ఎస్‌హెచ్‌ఒలు పరిశీలించి వారి అవసరతను తెలియజేయాలని తెలిపారు. ఎస్‌హెచ్‌ఒలు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఉంటారని, ఒక వీడియో గ్రాఫర్ ను కూడా వారితో పెట్టాలని , ఆర్.డి.ఓ లు, తహసిల్దార్ల తో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి సేతు మాధవన్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విగ్రహాలకు ముసుగులు

విజయనగరం టౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీ నాయకుల విగ్రహాలకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో పట్టణ ప్రణాళికా సిబ్బంది గురువారం ఉదయం ముసుగులను తొడిగారు. ఎన్నికల నిబంధనావళి పూర్తయ్యాక వాటిని తొలగిస్తారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీలో అధికార్లు రాజకీయ పార్టీ ఫ్లెక్సీలను గురువారం తొలగించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటన రావడంతో ఎన్నికల నియమావళి తక్షణమే అమలుచేస్తూ కమిషనర్ కె. అప్పలరాజు పర్యవేక్షణలో స్థానిక మొయిద జంక్షన్‌లో ఫ్లెక్సీలు తొలగించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్వాడీల పోస్ట్‌కార్డు ఉద్యమం

ఐసిడిఎస్‌కు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని ఎంపి కార్యాలయ కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర బడ్జెట్‌లో ఐసిడిఎస్ బలోపేతానికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఇదే విషయమై విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కార్యాలయ కార్యదర్శికి గురువారం వినతినిచ్చారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఐసిడిఎస్‌ను సంస్థగతం చేయాలని, అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు, మినీ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ వర్తింపజేసి అమలు చేయాలని , కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని , ఇందుకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించేలా ఆర్థికమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ విజ్ఞప్తిని ఎంపికి ఫోన్‌లో మాట్లాడి వివరించారు. ఆయన స్పందిస్తూ పార్లమెంట్‌లో ఈ విషయమై మాట్లాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి,పైడ్రాజు, ఎస్.అనసూయ, జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు బి. ప్రభ పాల్గొన్నారు

శృంగవరపుకోట : అంగన్వాడీలు గురువారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని, సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని రాష్ట్రపతికి పోస్ట్ కార్డులు పంపారు. కార్యక్రమంలో డి.శ్యామల కుమారి, లక్ష్మి, నాగజ్యోతి, కోట లక్ష్మి, ఈశ్వరమ్మ, గౌరీశ్వరి గంగ, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు జిల్లా నాయకులు చల్ల జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి పోస్టుకార్డులు రాశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, తదితర డిమాండ్లతో లేఖ రాశారు.

భోగాపురం : ఐసిడిఎస్‌ను క్రమబద్ధీకరించి గ్రాట్యుటీ అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడి కార్యకర్తలంతా వ్యక్తిగత దరఖాస్తులను ప్రదర్శించారు. ఈ దరఖాస్తులను పోస్టల్ ద్వారా రాష్ట్రపతికి పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం కొర్లమ్మ, అనిత, దేవి పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో లేఖలను చూపుతున్న అంగన్వాడీలు

సిటియు భవనాల పనులు వేగవంతం

ఏప్రిల్‌కి తొలిదశ నిర్మాణాలు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

జిల్లాలోని దత్తిరాజేరు, మెంటాడ మండలాల పరిధిలో ఏర్పాటవుతున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం భవన నిర్మాణాల పనులను జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ గురువారం పరిశీలించారు. దత్తిరాజేరు మండలం మరడాం, మెంటాడ మండలం కుంటినవలస గ్రామాల పరిధిలో 560 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం కేటాయించడంతోపాటు ఈ విద్యాసంస్థలో తాగునీటి సరఫరా, విద్యుత్, రోడ్ల నిర్మాణం తదితర మౌళిక వసతులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయాన్ని ఈ క్యాంపస్ నుంచే నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ సిటియు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. బాలుర వసతిగృహం, పరిపాలన భవనం, మెస్, అతిథి గృహం పనులు జరుగుతున్న తీరును పరిశీలించి ఏప్రిల్ నాటికి పూర్తయ్యేదీ లేనిదీ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. 2027 నాటికి అన్ని భవనాలను పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొంది ంచామని అధికారులు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి త్వరగా నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని, ఈలోగా టెండరు ప్రక్రియ పూర్తిచేసి నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఇ లక్ష్మణరావును ఆదేశించారు. తాగునీటి సరఫరాలో భాగంగా కుంటినవలస గ్రామం వద్ద గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తిచేసిన పంపుహౌస్‌ను పరిశీలించారు. 1.5 కిలోమీటర్ల పైప్‌లైను కూడా వేశామని, 500 మీటర్ల పైప్‌లైను నిర్మాణంలో స్థానిక రైతులు కొందరు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నట్టు ఎస్ఇ కవిత కలెక్టర్‌కు తెలిపారు. రైతులతో మాట్లాడి పనులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని మెంటాడ తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

సూచనలు చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

మరడాం వద్ద వున్న 400 కె.వి.విద్యుత్ కేంద్రం నుంచి మూడు జిల్లాలకు విద్యుత్ పంపిణీ జరగాల్సి వున్నందున గిరిజన విశ్వవిద్యాలయ ప్రాంగణం నుంచి హైటెన్షన్ విద్యుత్ టవర్లు వెళ్లేందుకు అనుమతించాలని, గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన స్థలం నుంచి తమ సంస్థకు పది ఎకరాలు టవర్ల ఏర్పాటుకోసం కేటాయించాలని ట్రాన్స్‌కో అధికారులు కలెక్టర్‌ను కోరారు.అనంతరం కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఏప్రిల్ నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి ఒక బ్లాక్‌ను ప్రారంభించే లక్ష్యంతో పనులు చేస్తున్నారని చెప్పారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ టి.శ్రీనివాసన్ మాట్లాడుతూ తొలి దశ పనులను మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం కల్లా ఈ ప్రాంగణంలో తరగతులు ప్రారంభించాలని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పర్యటనలో గిరిజన విశ్వవిద్యాలయం ఎఒ డాక్టర్ ఎన్.వి.ఎస్.సూర్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుప్రియ దాస్, బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ బాలాజీ, ప్రాజెక్టుల విభాగం ఎస్ఇ. నరసింగరావు, విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్.ఇ. లక్ష్మణరావు, గ్రామీణ నీటిసరఫరా ఎస్.ఇ. కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ ఉపాధి పనులు జరగాలి

విజయనగరం : ప్రతి గ్రామా పంచాయతీలోను ప్రతి రోజు ఉపాధి పనులు తప్పక జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. ఉపాధిహామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు, పనిదినాల కల్పనపై ఎంపిడిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లతో తన ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఉన్నది రెండు నెలల గడువేనని , ఈ ఏడాది లక్ష్యాలను పూర్తి చేయక పోతే వచ్చే ఏడాదికి నిధులు రాకపోవచ్చునని, పేద ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదని స్పష్టం చేసారు. ఇకనుంచీ ఈ పనులపై ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమీక్షిస్తామని చెప్పారు. క్షేత్ర స్థాయిలో ఖాళీగా నున్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ లను వెంటనే పూరించడానికి అవసరమగు చర్యలు తీసుకోవాలని డ్వామ పీడీ శారదా దేవికి ఆదేశించారు.

జగన్ చేసిన అప్పులే రాష్ట్రానికి ముప్పు : ఎమ్మెల్యే

విజయనగరం కోట : మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన అప్పులే రాష్ట్రానికి ముప్పుగా పరిణమించాయని ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. గత అయిదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాళా తీయించారని విమర్శించారు. గత 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ లాంటి బకాయిలు రూ.22 వేల కోట్లను చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చెల్లించిందన్నారు, అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసి, చేసిన అప్పులతో జగన్ విలాసాలు, దుబారా ఖర్చులు చేశారని, రాష్ట్రాభివృద్ధికి వినియోగించలేదని అన్నారు. ఇన్ని అప్పులు చేసినా ఇంకా అనేక వ్యవస్థల్లో బకాయిలు పెట్టారని వివరించారు.

నిలిచిన బిల్లులు

ఆగిన పల్లె పండగ పనులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండగ పనులు నిలిచిపోయాయి. నెల రోజులుగా పనులు చేపట్టిన వెండర్లకు బిల్లులు చెల్లింపు నిలిచిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. విజయనగరం మండలంలో కూడా పల్లె పండగ పనులు 23 గ్రామాల్లో వెండర్స్‌కు ఆయా గ్రామాల్లో పనులు చేపట్టారు. మండలం మొత్తంగా రూ.10కోట్లతో సిసి రోడ్లు, కాలువలు, గోశాలలు నిర్మిస్తున్నారు. పనులు చేపట్టిన వారానికే బిల్లులు వెండర్ ఖాతాలో వేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ విధంగా రెండు వారాలు పాటు చెల్లించారు. ఆ తరువాత నెలరోజులైనా బిల్లులు కాకపోవడంతో చాలా గ్రామాల్లో పనులు నిలిచి పోయాయి. దీనిపై ఎంపిడిఒను వివరణ కోరగా, బిల్లులు నిలిచిపోవడం మాట వాస్తవమే అన్నారు. ఈ నెల 5న బిల్లులు విడుదలయ్యాయని, ఆ తరువాత విడుదల కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందుగా పెట్టుబడి పెట్టి పనులు చేపట్టిన వెండర్లు నేడు బిల్లులు అందక లబోదిబో మంటున్నారు. మండల వ్యాప్తంగా 50శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పనులకు రూ.1,52,97,399 చెల్లించవలసి ఉంది.

గాంధీ స్ఫూర్తితో లేబర్ కోడ్ల రద్దుకు ఉద్యమం

మత సామరస్యాన్ని కాపాడుకుందాం ● సిఐటియు పిలుపు

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు, జెవివి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గాంధీజి స్ఫూర్తితో లేబర్‌కోడ్‌ల రద్దుకు ఉద్యమిద్దామని సిఐటియు నాయకులు అన్నారు. జాతిపిత గాంధీ వర్థంతిని ఎల్‌బిజి భవనంలో గురువారం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఎ. జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులే నేడు అధికారంలో ఉన్నారని, వారి వల్ల భారత రాజ్యాంగం, కార్మిక హక్కులు పెను ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపా లాంటి చట్టాల్ని ప్రయోగించి బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వాదులను, కవులను, రచయితలను, ఉద్యమకారులను నిర్బంధాలకు గురి చేస్తుందని అన్నారు. కార్మికులు కట్టు బానిసలను చేసేందుకు 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చారని, వీటి రద్దుకు గాంధీ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెవివి నగర అధ్యక్షులు ఎల్ చిన్నారి, ప్రజా సంఘాల నాయకులు శంకర్రావు, సూరి, నారాయణరావు, వెంకటేష్, రాంబాబు, కుమారి ,రమ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఎస్‌ఎఫ్‌ఐ, గాంధీ బ్లెడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మంది యువత రక్తాన్ని దానం చేశారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రక్తదానం చేశారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడిన నాయకులలో గాంధీజీ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని అటువంటి గాంధీజీని ఆర్‌ఎస్‌ఎస్ ఉగ్రవాది గాడ్సే 1948 జనవరి 30న అందరూ చూస్తుండగానే కాల్చి చంపారని గుర్తు చేశారు. ఆపదలో ఉన్న వ్యక్తులకు మనం అందించే సాయం రక్తదానమని అది ప్రాణదానంతో సమానమని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏటా మూడుసార్లు రక్తదాన శిబిరాలు జిల్లాలో అన్నిచోట్ల ఏర్పాటు చేస్తామని దానిలో భాగంగానే గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేశామని చెప్పారు. ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణాజి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంతో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె రవి కుమార్, ఎం వెంకీ, జిల్లా సహాయ కార్యదర్శి ఇ వంశీ, జిల్లా కమిటీ సభ్యులు రమణ, రూప, నాయకులు మధు ,జగదీష్, నాని, తేజ, పవన్, సాయి, సూర్య, చైతన్య, ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువత

రోడ్డు పనులు ప్రారంభించే వరకూ పోరాటం

నాలుగో రోజుకు ఆతవ గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి-వేపాడ

రోడ్డు పనులు ప్రారంభించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆతవ గ్రామస్తులు స్పష్టంచేశారు. రోడ్డు పనులు చేపట్టాలని కోరుతూ ఆతవ గ్రామస్తులు చేపట్టిన నిరసన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామస్తులు రహదారిపై రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపైనే భోజనాలు చేశారు. రాళ్లు తేలి నడవలేని స్థితిలో ఆతవ రోడ్డు ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పట్టించుకోలేదని నాయకులు ఆతవ ఉదయ భాస్కర్, చల్లా జగన్, గొంప వేమన రాము, కెర్రి దేముడు, గొంప సన్నిబాబు, గొంప అవతారం, బోని నాగరాజు, ఆతవ నాగరాజు మండిపడ్డారు. పాలకులు, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఆతవ రోడ్డుకు ఈ దుస్థితి పట్టిందని విమర్శించారు. నిధులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం ఎందుకని, తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రోడ్డు పనులు చేపట్టే వరకూ నిరసన కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో తంగేటి సన్నిబాబు, చప్ప నూకరాజు, జగది, డప్పురాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న ఆతవ గ్రామస్తులు

జ్యూట్ యాజమాన్యం గైర్హాజరు దుర్మార్గం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చర్చలకు జ్యూట్ యాజమాన్యం గైర్హాజరు కావడం కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద కార్మిక, సంఘాలు, జ్యూట్ యాజమాన్యానికి మధ్య చర్చలకు అధికారులు పూనుకున్నారు. అయితే చర్చలకు జ్యూట్ యాజమాన్యం గైర్హాజరు కావడంతో కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు, ఇఫ్టూ నాయకులు నామల తిరుపతి రావు, శ్రామిక సంఘం నాయకులు చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ అక్రమ లాక్ ఔట్ చేసిన జ్యూట్ యాజమాన్యం మిల్లు తిప్పడానికి కార్మిక శాఖ అధికారులు జరుపుతున్న చర్చలకు గైర్హాజరు కావడం దుర్మార్గమన్నారు. యాజమాన్యం అక్రమ లాక్ ఔట్ చేసి 9నెలలు గడుస్తున్నా పట్టించుకోకుండా చర్చలకు పలుమార్లు గైర్హాజరు కావడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు జ్యూట్ యాజమాన్యం మొండి వైఖరిపై కార్మిక సంఘాలు వినతులు ద్వారా వేడుకున్నామని అయినా సరే జ్యూట్ యాజమాన్యం చర్చలకు గైర్హాజరు కావడం ఏమిటని ప్రశ్నించారు. చర్చలు ఈ నెల 10కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి జ్యూట్ యాజమాన్యాన్ని చర్చలకు హాజరు పర్చడంతో బాటు మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలా కాని పక్షంలో విజయవాడ రాష్ట్ర లేబర్ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు కొండల కరువులు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కెజిబివి సిబ్బందితో రాష్ట్ర కార్యదర్శి దేవానంద్‌రెడ్డి

విద్యార్థినుల ఉన్నతికి కెజిబివిలు దోహదం
ప్రాజెక్టు రాష్ట్ర కార్యదర్శి దేవానంద్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థినుల సర్వతోముఖాభివృద్ధికి కెజిబివిలు దోహదం చేస్తున్నాయని కెజిబివి విద్యాలయ రాష్ట్ర కార్యదర్శి దేవానంద్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని కెజిబివిల ప్రిన్సిపాళ్లతో విజయనగరం కెజిబివిలో సమావేశం నిర్వహించారు. రాబోయే ఇంటర్, టెన్త్ పరీక్షలకు కెజిబివిల్లో అనుసరిస్తున్న పంచతంత్ర ప్రణాళిక అమలుపై రివ్యూ చేశారు. విద్యార్థినుల నైపుణ్యం, ఉత్తీర్ణశాతం పెంపుదలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఎపిసి ఎ.రామారావు, జిసిడిఇఒ పి.మాలతి, అసిస్టెంట్ జిసిడిఒ కె.గాయత్రి పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాల రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ గురువారం పాఠశాల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఉచిత విద్య అందించే పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా స్థల మార్పిడి చేసి రిజిస్ట్రేషన్ చేయడం అన్యాయమన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాల గుర్తింపు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఎఐవైఎఫ్ పట్టణ నాయకులు బి.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు

ప్రజాశక్తి- రేగిడి

ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.300 కూలి గిట్టుబాటు అవుతుందని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. గురువారం లింగాలవలస పంచాయతీలో కొండివాని చెరువు పనులను ఆయన పరిశీలించారు. చెరువు పనిలో 81 మంది వేతనదారుల మస్తర్లను తనిఖీ చేశారు. వేతనదారులతో మాట్లాడుతూ రెండు పూటలు, కొలతలు ప్రకారం పనిచేసినట్లు అయితే 300 రూపాయలు కూలి గిట్టుబాటు అవుతుందని తెలిపారు. మేట్లు ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు రెండు పూటలు పంపించాలన్నారు. చెరువు పనులు పూర్తి స్థాయిలో చేయాలని వేతనదారులకు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, మేట్లు వేతనదారులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిసిని అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-బాడంగి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(ఎస్‌డబ్ల్యుపిసి)ను ప్రతి గ్రామంలో అందుబాటులోకి తేవాలని ఎంపిడిఒ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని భీమవరంలో ఎస్‌డబ్ల్యుపిసి షెడ్‌ను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 15వ తేదికి ఎస్‌డబ్ల్యుపిసిలను వినియోగంలోకి తేవాలని సూచించారు. ఇంటి పన్నులు సక్రమంగా వసూలు చేయాలని, ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు. పల్లె పండగ పనులు వేగవంతం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇఇ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోటిచెరువు 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల కింద చెట్టు కొమ్మలు తొలగించి, మరమ్మతులు చేపట్టడంతో గాంధీ బొమ్మ, చీపురుపల్లివీధి, వాటర్ టాంక్, మెహర్ కాలనీ, వెలమవారివీధి, పోలీసు స్టేషను పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. జగన్నాథపురం సబ్ స్టేషన్ నిర్వహణ పనులు చేపట్టడంతో ఆ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయనగరంలో పలుచోట్ల...

విజయనగరంటౌన్ : ఈనెల 31న తోటపాలెం, విటి అగ్రహారం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ డిఇ పి.త్రినాధరావు తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో చెట్లు కొమ్మలను తొలగించే క్రమంలో బ్యాంక్ కాలనీ, శ్రీరాం నగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్, నాగోజిపేట, కోర్టు ఏరియా, ప్రదీప్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తామని తెలిపారు.

గురజాడ విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గురజాడ విద్యార్థులు పాఠశాల నుంచి రైతు బజారు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవి ఆర్ కృష్ణాజి, కరస్పాండెంట్ ఎం.స్వరూప, పాఠశాల హెచ్ఎం పూడి శేఖర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన గాంధీ త్యాగాలను విద్యార్థులకు తెలయజెప్పేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

దళితులపై కుల వివక్షత తగదు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ గ్రామ దళితుల పట్ల వివక్షత తగదని మండల దళిత జెఎసి అధ్యక్షులు తేగల మోహన్‌రావు అన్నారు. బూరాడ గ్రామ దళిత కాలనీలో గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.రేవతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో దళితులు తమ గోడును వినిపించారు. గ్రామంలో ఉన్న దళిత మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను వివరించారు. మోహన్‌రావు మాట్లాడుతూ బూరాడ గ్రామంలో చాలా ఏళ్లుగా దళితులకు సంబంధించి శ్మశాన వాటికకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎన్నోసార్లు కలెక్టర్, తహశీల్దార్‌కు గత గ్రీవెన్స్, ప్రస్తుత స్పందనకు విన్నవించినా ఫలితం లేదన్నారు. సామాజిక భవనం శిథిలావస్థలో ఉందని, భవనాన్ని మంజూరు చేయాలని విన్నవించారు. వీరితోపాటు బూరాడ విఆర్ఒ, మహిళలు ఉన్నారు.

ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడులో మరిడిమాంబ జాతర సందర్భంగా తొలిరోజు గురువారం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల్లో 16 ఎడ్లబండ్లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచిన ఎడ్లబండి యజమానికి రూ.12 వేలు, రన్నర్‌కు రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులను టిడిపి నాయకులు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ బీల రాజేశ్వరి తెలిపారు.

పోటీలో పాల్గొన్న ఎండ్లబండి

గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

అహింసా మార్గంతో దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మ గాంధీ పోరాటం స్ఫూర్తి దాయకమని పలువురు వక్తలు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లాలో పలుచోట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తన క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ మహాత్ముని ప్రస్తావన లేకుండా భారత దేశ చరిత్ర లేదన్నారు. చంపారన్ ఉద్యమం మొదలు కొని స్వాతంత్ర్య సాధన వరకు శాంతి మార్గంలో ఆయన చేసిన పోరాటం ఉద్యమ చరిత్ర లో నూతన అధ్యాయమని పేర్కొన్నారు. ఖద్దరుకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యతను తెలుసుకుని చేనేతను ప్రోత్సహించాల్సి ఉందన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడమే నిజమైన నివాళిగా పేర్కొన్నారు.

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

గాంధీజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

మహాత్మా గాంధీ ఆశయాలు గొప్పవని, ఆధునిక సమాజానికి స్ఫూర్తిదాయకమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

మార్గదర్శకుడు గాంధీ

విజయనగరం కోట : జాతిపిత మహాత్మా గాంధీ మార్గదర్శకుడని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి సమస్యనైనా అహింస, శాంతియుత, సత్యాగ్రహం మార్గం ద్వారా సాధించగలమని ఆచరణలో చేసి చూపిన మహనీయులని అన్నారు. బ్రిటిష్ వారు విభజించి పాలించడాన్ని వ్యతిరేకించి, స్వాతంత్ర పోరాటంలో దేశాన్ని ఏకతాటిపై తీసుకువచ్చిన గాంధీ స్ఫూర్తితో అందరూ మెలగాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు,కుర్రోడు నర్సింగరావు, ప్రసాద్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

బొబ్బిలి : వైసిపి కార్యాలయంలో గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, రెడ్డి దామోదర్, తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ కాలనీలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు ముువ్వల శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదితి

మెంటాడ : గాంధీకి జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు గండ్రేటి అప్పలనాయుడు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.రమాకుమారి, అంగన్వాడీలు గొర్లె సన్యాసమ్మ, బి.కొండమ్మ, బి.మంగమ్మ, సిహెచ్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో గాంధీ విగ్రహానికి వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల విజయ్ కుమార్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా అధికారి బాలనాగు శ్రీనివాస్, రీజనల్ చైర్మన్ హెచ్.నానాజీ, రీజనల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్, జోన్ చైర్మన్ ఎం.శివకుమార్, క్లబ్ సెక్రటరీ బోండా సురేష్ కుమార్, కోశాధికారి మహేంద్ర ఉపాధ్యక్షులు వి.సతీష్ పాల్గొన్నారు .

నెల్లిమర్ల : తంగుడుబిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఇన్చార్జి హెచ్ఎం వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో గణిత ఉపాధ్యాయులు బంగారయ్య ఉపాధ్యాయలు, విద్యార్థులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతిపిత గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టువ్యాధిపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని డిఎంహెచ్ఒ డాక్టర్ జీవన రాణి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కుష్టు నివారణపై అవగాహన కార్యక్రమాలు ఫిబ్రవరి 13 వరకు జరుగుతాయని తెలిపారు. ఆశా కార్యకర్తలు, స్త్రీ ఆరోగ్య కార్యకర్తల ద్వారా ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్, క్షయ రోగ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి, వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ అచ్యుత కుమారి, ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి మణి, డెమో చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గురుకుల విద్యార్థినులతో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, పిహెచ్ ఎన్.జగదాంబ, హెచ్‌వి పద్మావతి, హెచ్ఎస్ ఈశ్వరరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ ఈశ్వరరావు, ఫార్మాసిస్ట్ ఆశాజ్యోతి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎల్‌టి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : క్షయ రహిత భారత్‌కు అందరూ సహకరించాలని కోరుతూ తహశీల్దార్ సులోచనారాణి, ఎంపిడిఒ రత్నం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు గురువారం ర్యాలీ నిర్వహించారు. స్టేట్ టిపిఎం కోఆర్డినేటర్ అరుణకుమారి, సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సింధుజ, వెలుగు, ఆశా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

నెల్లిమర్ల : కుష్టు నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని హీల్ ప్రాజెక్టు మేనేజర్ కిస్మత్ నందా కోరారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ది లేప్రోసీ మిషన్ ట్రస్ట్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక శ్రీఆదిత్య విద్యాలయం పాఠశాలలో కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఎఐ బి.గణేష్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పాల్గొని మాట్లాడారు. పాఠశాల ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఎస్ఐ గణేష్ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో చెల్లూరు లెప్రసీ మిషనల్ హీల్ ప్రాజెక్ట్ ప్రతినిధి డాక్టర్ తాలాడ దీప్తి, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి. సూరిబాబు హెచ్ఎంవి అమృత, సిడిఒ వంశీ, అనిల్ మనోజ్, మెహతార్ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో ముందుండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - జామి

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్య సాధనలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి పనిచేయాలని డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. గురువారం జామి పిహెచ్‌సిని ఆకస్మికంగా సందర్శించి, పలు ఆరోగ్య కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రసవాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పలనాయుడు

స.హ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జామి

పారదర్శక పాలన, ప్రజలకు చేరువకు ఎంతో దోహదపడే సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు అన్నారు. గురువారం జామి ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి అధికారి చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం న్యాయవాది బూసర్ల రమణారావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని తప్పుదోవ పట్టకుండా చూడాలంటే చట్టంపై అధికారులే ఎక్కువ అవగాహన పొంది, తగిన విధంగా సమాధానాలు రాయాలన్నారు. అప్పుడే బోగస్ వ్యక్తుల దరఖాస్తులు తగ్గి, సామాన్యుడు చేసుకునే దరఖాస్తుకు విలువ ఉంటుందన్నారు. అనంతరం పలువురు స.హ చట్టం కార్యకర్తలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో చదలవాడ ప్రసాదరావు, డి.సూర్యారావు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- రేగిడి

గ్రామ పంచాయతీలో పశువైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త సంచాలకులు, ప్రత్యేక అధికారి ఆర్.చిన్నయ్య, వైవి రమణ అన్నారు. గురువారం చిన్నశిర్లాం గ్రామంలో పశువైద్య శిబిరాన్ని పరిశీలించారు. సంకిలి పశు వైద్యాధికారి దుర్గ ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు చేపట్టారు. ముందుగా ఏ పంచాయతీల్లో పశువైద్య కేంద్రాలు నిర్వహించారో, ఎన్ని పశువులకు తనిఖీలు నిర్వహించి మందులు ఇచ్చారో రికార్డులను పరిశీలించారు. విజయనగరంలో ఫిబ్రవరి నెలలో పాల పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో అన్ని గ్రామాలలోని ఎక్కువ పాలు ఇస్తున్న రైతులను గుర్తించేందుకు ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. రాజాం సహాయ సంచాలకులు బి.జయప్రకాష్ ఉన్నారు.

ధర్నా చేస్తున్న కార్మికులు

ఎండిఎం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కొత్తవలస

మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ డిమాండ్‌చేశారు. గురువారం కొత్తవలస ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు ప్రభుత్వం జీతాలు, బిల్లులు చెల్లించకపోయినా పథకాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. నిర్వహణకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులను లెక్కల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ జి.శ్రీదేవికి వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు నాయకులు గాడి అప్పారావు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎస్.లీలావతి, అప్పలకొండ, జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది లేకుండా విక్రయాలు చేపట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వీధి విక్రయాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు పలువురు వీధి విక్రయదారులు ఆయనను కలిసిన సందర్భంగా పలు సూచనలు చేశారు. రహదారులను ఆక్రమించి వీధివిక్రయాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా వీధి విక్రయాలు చేపట్టాలన్నారు. నిర్దేశిత ప్రాంతాలలో మాత్రమే తోపుడుబళ్లను నిలుపుకొని వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు.

బాలుడి ఆచూకీ లభ్యం

విజయనగరం కోట : రెండు రోజుల క్రితం అదృశ్యమైన నగరంలోని నాగవంశపు వీధికి చెందిన ఇంటర్ విద్యార్థి జరజాపు ఫణీంద్ర ఆచూకీ లభించినట్లు వనటౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన ఫోన్ కాల్ ట్రాక్ ఆధారంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రం హౌరాలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. తండ్రి వాసుదేవరావు వెళ్లి బాలుడిని కలిశారని తెలిపారు. శుక్రవారం బాలుడిని విజయనగరం తీసుకొస్తామని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి, మహారాజుపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు దివిస్ కంపెనీ యాజమాన్యం జిల్లా కామన్ ఎంట్రన్స్ బోర్డు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేసింది. పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 63 మందికి ప్రధానోపాధ్యాయులు ఇందిర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మహారాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఆధ్వర్యంలో 48 విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి శతశాతం ఉత్తీర్ణతతో పాటు, ప్రతి సబ్జెక్టులో ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చునని పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు. దివిస్ కంపెనీ సిఎస్ఆర్ ప్రతినిధి ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు ఇంకా 40 రోజులు మాత్రమే సమయం ఉన్నందున ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రణాళిక ప్రకారం ఈ స్టడీ మెటీరియల్ అనుసరించి చదివినట్లయితే శతశాతం ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శిస్తున్న న్యాయమూర్తి రాజేష్‌కుమార్

సబ్ జైల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోటలోని సబ్‌జైల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. సిబ్బంది నిర్వహించే విధులు, ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, ఖైదీలకు అందజేయాల్సిన ఉచిత న్యాయ సేవలు అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరపున ఉచితంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.వివరాలను సబ్‌జైల్ సూపరింటెండెంట్ ద్వారా గాని, లేదా జైలు సందర్శక న్యాయవాదికి గాని దరఖాస్తు అందజేయాలని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి- భోగాపురం



మండలంలోని సిమ్మపేట పెట్రోల్‌బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం కారు, జెసిబి ఢీకొన్న సంఘటనలో నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, మోదవలస వైసిపి నాయకుడు బోని అప్పలనాయుడు (50) మృతి చెందారు. మోదవలస గ్రామానికి చెందిన బోని అప్పలనాయుడు భోగాపురం వైపు నుంచి కారులో ఇంటికి వెళ్తున్నారు. ఇంతలో సవరవల్లి వైపు నుంచి జెసిబి వస్తుండడంతో ఎదురెదురుగా రెండూ ఢీకొన్నాయి. దీంతో అప్పలనాయుడుకు గాయాలవ్వడంతో తగరపువలసలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. ట్రాఫిక్ జామ్ అవడంతో సిఐ ఎన్. వి ప్రభాకర్, ఎస్ఐ పాపారావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను సరిదిద్దారు. అప్పలనాయుడుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.పెద్దకుమార్తె దివ్య సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేయగా, చిన్న కుమార్తె యువశ్వేత మోదవలస ఎంపిటిసిగా ఉన్నారు. కుమారుడు బిటెక్ చదివాడు.

బంగారం చోరీ

ప్రజాశక్తి-భోగాపురం

ఇంట్లో దాచుకున్న రెండున్నర తులాల బంగారం, కొంత నగదు చోరీకి గురైనట్లు కింజరాపు విజయలక్ష్మి అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసు అందించిన వివరాలు ప్రకారం. శ్రీకాకుళం జిల్లా నర్సన్న పేట మండలం కోమటి గ్రామానికి చెందిన కింజరపు రాంబాబు క్వారీ లో పనిచేస్తున్నారు. భార్యతో సహా పెద్ద వీధిలో నివాసం ఉంటున్నాడు. సంక్రాంతికి సొంత ఊరు వెళ్లి ఈనెల 17వ తేదీన భోగాపురం వచ్చారు. అనంతరం ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారం వస్తువులను, కొంత నగదును సూట్ కేసులో విజయలక్ష్మి పెట్టింది. మళ్లీ ఈ నెల 21న సొంత గ్రామం వెళ్లి 22న వచ్చి చూసేసరికి సూట్ కేసులో పెట్టిన బంగారం, నగదు కనిపించలేదు. దీంతో స్థానిక పోలీసులకు 29న విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు. దొంగతనం జరిగిన ఇంటిని సిఐ ఎన్ వి ప్రభాకర్ పరిశీలించారు.

నాలుగు లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-గజపతినగరం

ఇద్దరు వ్యక్తుల నుంచి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ పి.నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం నిర్వహించిన పెట్రోలింగ్‌లో పోరాం గ్రామానికి చెందిన దుంబిరి ఎర్రయ్య వద్ద 2 లీటర్లు, రెడ్డివానివలస గ్రామానికి చెందిన పందిరి రామయ్య వద్ద 2 లీటర్ల సారా లభ్యమైందని చెప్పారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ ఎన్.కొండలరావు, హెడ్ కానిస్టేబుల్ ఎండి.జె.భాషా, కానిస్టేబుళ్లు ఎ.అప్పారావు వి.అప్పారావు పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి విఫలం : వైసిపి

ప్రజాశక్తి-బొబ్బిలి/కొత్తవలస/గజపతినగరం

ఎన్నికల హామీలను అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య విమర్శించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి హామీలకు భ్రమపడి ఓట్లు వేసి గెలిపిస్తే నేడు హామీలను అమలు చేయడం లేదన్నారు. 50ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని, మెగా డిఎస్‌సి ఇస్తామని చెప్పి నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ప్రజలు అడుగుతుంటే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని సిఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసీ కూడా మోసపూరిత హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సంపద సృష్టిస్తానంటూ చెప్పి ఇప్పుడేం చేస్తున్నారని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. అబద్ధపు హామీలతోనే గతంలో మూడుసార్లు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల సంక్షేమం చంద్రబాబుకు అవసరం లేదని, ఆయన సామాజిక తరగతి వారు మాత్రమే బాగుపడాలనే ఆరాటమని దుయ్యబట్టారు. సమావేశాల్లో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీకృష్ణ, బాడంగి జెడ్‌పిటిసి పి.రామారావు, మాజీ ఎంపిపి రెడ్డి దామోదర్, జెడ్‌పిటిసి గార తవుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో యూనివర్శిటీ పరీక్షలలో ప్రతిభ చూపించిన 21 మంది విద్యార్థులకు బొత్స గురు నాయుడు, మజ్జి రామారావు మెమోరియల్ ప్రతిభా పురస్కారాలు గురువారం అందజేశారు. గత ఏడాది యూనివర్సిటీ పరీక్షలు, క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5వేలు రూపాయలు, సర్టిఫికేట్, మెడల్స్‌ను సత్య విద్యాసంస్థల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి, డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అందజేశారు. కార్యక్రమంలో మజ్జి అనురాధ, భార్గవ్ భూషణ్, వివేక్ భూషణ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి పాల్గొన్నారు.

ప్రతిభచూపిన విద్యార్థులతో ఝాన్సీలక్ష్మి, శశిభూషణరావు